క్లుప్తంగా

బాధితులకు ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న దాతలు

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామ శాంతినికేతన్ పాఠశాల కరస్పాండెంట్ గణగొని విజయ్ మూడో వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబసభ్యులు పలు బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. న్యూమోనియతో బాధపడుతున్న మండలంలోని మొర్రిగూడెం గ్రామానికి చెందిన ముత్యాల శ్రీనివాస్ కూతురుకు రూ.10 వేలు, ఇటీవల మరణించిన లింగాపూర్‌కు చెందిన పారిశుద్ధ్య కార్మికుడు బుజ్జిబాబు కుటుంబీకులకు రూ.5 వేలను సాయంగా అందించారు. కార్యక్రమంలో గణగొని నిషిత, అయాన్‌గంగా, వియాన్‌శివ్ తదితరులున్నారు.

భైంసాలో గస్తీ

భైంసాటౌన్: పట్టణంలో గురువారం రాత్రి పోలీసుల ఆధ్వర్యంలో గాంజా గస్తీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక టిప్పుసుల్తాన్ చౌక్, కుభీర్ చౌరస్తాలోని పలు పాన్ దుకాణాల్లో ఎస్సై సుప్రియ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. గంజాయి విక్రయించినా, నిల్వ ఉంచినా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామ కేజీబీవీలో స్వీపర్ కమ్ స్కావెంజర్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేకాధికారి సునీత తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పదోతరగతి కలిగిన మహిళ జనరల్ అర్హులని.. విద్యార్హత పత్రాలు, ఆధార్, పాస్‌ఫొటోతో అభ్యర్థులు ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి

కడెం: మండలంలోని కల్లెడ గ్రామంలో గురువారం గంట లచ్చన్నకు చెందిన ఎద్దు విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. మేతకు వెళ్లిన ఎద్దుకు ఎల్లమ్మ ఆలయ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.డెబ్బై వేలు ఉంటుందని.. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

'రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ ధర్నా'

నిర్మల్‌టౌన్: ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పేరిట కొత్త డ్రామాకు తెరలేపిందని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ ఆరోపించారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీసీలపై గౌరవం ఉంటే రాష్ట్ర మంత్రివర్గంలో జనాభా ప్రతిపదికన బీసీలకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు

పనులు వేగవంతం చేయాలి

దస్తురాబాద్: గ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీవో రమేశ్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని గోడిసిర్యాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించారు. మండలానికి మొదటి విడతగా 233 ఇళ్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. పనులను కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో హౌజింగ్ ఏఈ వంశీ, కార్యదర్శి రామకృష్ణ ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

భైంసారూరల్: మండలంలోని చుచుంద్ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో భైంసా గురుకృపా ఒకేషనల్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వెంకటేశ్, సురేశ్, ఉపాధ్యాయులు , కళాశాల ప్రిన్సిపాల్ సాయినాథ్ తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం

తానూరు: మండలంలోని బెల్‌తరోడా గ్రామంలో మున్నూరుకాపు సంఘం గ్రామ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా ధర్మపురి పండరి, ఉపాధ్యక్షుడిగా మేకల గంగాధర్, కార్యదర్శిగా మేకల రాజేశ్వర్, కోశాధికారిగా గోప బాలాజీ, కార్యదర్శులుగా శంకర్, దత్తు సభ్యులుగా డి.రాజు, కైలాశ్, భోజారాం, ప్రవీణ్, పండరి, ధర్మన్న, సాయన్న, పోశెట్టి, సాయినాథ్, దత్తు, గోపాల్, బాలాజీ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోషకుల సమావేశం

కుభీర్: మండలకేంద్రమైన కుభీర్ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థుల పోషకులతో సమావేశం నిర్వహించారు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత విద్యార్థులు చదివేలా చూడాలని పేర్కొన్నారు. హెచ్‌ఎం సట్ల గంగాధర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పండుగ జోష్..



బస్టాండ్ నుంచి వివేకానంద చౌక్ వరకు రోడ్డుపై వాహనాలు



ఇబ్బంది పడుతున్న వాహనదారులు



దుకాణంలో కిక్కిరిసిన జనం

జిల్లాకేంద్రంలో గురువారం దుకాణాలు జనంతో, రోడ్లు వాహనదారులతో రద్దీగా మారాయి. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం, శనివారం రాఖీ పౌర్ణమి కావడంతో పూజ సామగ్రి, రాఖీలు, అమ్మవారి విగ్రహాలు కొనేందుకు మహిళలు ఆయా దుకాణాల వద్దకు తరలివచ్చారు. వరుస పండుగల నేపథ్యంలో ప్రజలు రోడ్లపైకి రావడం.. రోడ్లపైనే తోపుడుబండ్లు ఏర్పాటు చేయడంతో బస్టాండ్, వివేకానందచౌక్, నారాయణరెడ్డి మార్కెట్ పరిసరాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



పూల దుకాణం వద్ద..



మార్కెట్‌లో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

వేయని రోడ్డుకు బిల్లులు

- అధికారుల అండతో సుమారు రూ.ఏడు లక్షలు కాజేసిన వైనం
- తనిఖీకి వస్తున్నారని ఆగమేఘాల మీద పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్
- కలెక్టర్ ఆదేశాలతో నిలిపివేత
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు



గురువారం ఉదయం సాగుతున్న చదును పనులు

ముథోల్: ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాతే సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో సీసీ రోడ్డు పనులు చేపట్టకున్నా.. బిల్లులు కాజేసిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో రావుల సాయిరెడ్డి ఇంటి నుంచి భూషణ్‌రెడ్డి ఇంటి వరకు (60 మీటర్ల సీసీ రోడ్డు నిర్మించేందుకు ఉపాధిహామీ పథకం కింద ప్రభుత్వం రూ.ఏడు లక్షలు మంజూరు చేసింది. 2025 మార్చి నెలలోనే పనులను పూర్తి చేయాలి. పంచాయతీరాజ్ అధికారులు సీసీ రోడ్డు పూర్తయినట్లు మార్చి 30న ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేశారు. దీంతో 6,97,287 రూపాయల బిల్లును సంబంధిత కాంట్రాక్టర్‌కు మంజూరు చేశారు. సీసీ రోడ్డు నిర్మించకుండా అధికారులు బిల్లులు మంజూరు చేయడంపై అనుమానాలకు తావిస్తోంది.

బయటకు పొక్కడంతో..

ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో ఉన్నతాధికారులు తనిఖీకి వస్తున్నారని తెలిసి అధికార పార్టీ నాయకులు అప్రమత్తమయ్యారు. బుధవారం రాత్రి మెటీరియల్‌ను డంపు చేశారు. గురువారం ఉదయం చదును చేయించి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో రోడ్డు పనులు నిలిపివేయాలని ఎంపీడీవో శివకుమార్‌ను ఆదేశించారు. దీంతో వెంటనే ఎంపీడీవో గ్రామానికి వెళ్లి పనులు నిలిపివేయించారు. ఈ ఘటనపై విచారణ జరిపి పనులు చేయకున్నా.. చేసినట్లు బిల్లులు మంజూరు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏఈ సస్పెన్షన్

నిర్మల్‌చైన్‌గేట్: ముథోల్ మండలం ఎడ్‌బిడ్ గ్రామంలో పంచాయతీరాజ్‌శాఖ చేపట్టిన పనుల్లో నకిలీ బిల్లుల వ్యవహారం వెలుగులోకి రావడంతో అక్కడి అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) సురేందర్‌ను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు



భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



మామడ : పొన్కల్ ప్రాథమిక పాఠశాలలో రాఖీ ఆకారంలో విద్యార్థులు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ముందస్తుగా రాఖీ పండుగ నిర్వహించారు. ఉపాధ్యాయులు రాఖీ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. నువ్వు నాకు రక్ష.. నేను నీకు రక్ష.. మనమిద్దరం దేశానికి రక్ష అంటూ వేడుకల్లో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



లక్ష్మణచాంద: వడ్యాల్ ఉన్నత పాఠశాలలో రాఖీలు కడుతున్న విద్యార్థులు



సోన్: కడ్తాల్ ప్రాథమిక పాఠశాలలో..

గ్రామాల్లోని సమస్యలు పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



మామడ: పొన్కల్ చెరువు తూమును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

మామడ: మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పొన్కల్ గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. డైనింగ్‌హాల్, అదనపు తరగతి గదులు, ఎస్సీ హాస్టల్, పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కేంద్రం ఏర్పాటు, ప్రహరీ నిర్మాణం, పాఠశాలను పీఎంశ్రీ పథకంలో చేర్చాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. పాఠశాలలో చదివి ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీట్లు సాధించిన విద్యార్థులు శ్రావ్య, శ్లేషను సన్మానించారు. అంతకుముందు ఎన్‌సీసీ విద్యార్థులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అరవింద్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండలంలోని పొన్కల్ గ్రామ చెరువును ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. చెరువు నీటి నిల్వ సామర్థ్యం, తూము మరమ్మతుల వివరాలను సిద్ధం చేయాలని నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. సాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు బాపురెడ్డి, రాజారెడ్డి, నరేశ్, గంగారెడ్డి పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తా

లక్ష్మణచాంద: రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తానని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండల కేంద్రంలోని పుల్చేరు చెరువు, ఊర చెరువుల తూములు సరిగా లేక నీళ్లు వృథాగా పోతున్నాయని రైతులు ఎమ్మెల్యేకు విన్నవించగా.. ఆయన వచ్చి పరిశీలించారు. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అడ్వాల రమేశ్, ముత్యంరెడ్డి, చిన్నయ్య, జీవన్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో బీజేపీ మహాసంపర్క్ అభియాన్



కడెం: ఎలగడపలో పథకాలు వివరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్, నాయకులు

కడెం: కేంద్ర ప్రభుత్వ పథకాలను గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్ అన్నారు. బీజేపీ మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని ఎలగడప, ధర్మాజీపేట్ గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతు కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించారు. ఇందులో బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేని శ్రీనివాస్, కిష్టయ్య, మోహన్‌నాయక్, శ్రీనివాస్, భీమన్న, ప్రవీణ్, శ్రీరాం, ప్రసాద్ తదితరులున్నారు.

దస్తురాబాద్: మండలకేంద్రంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను బీజేపీ మండలాధ్యక్షుడు పానుగంటి రాజు ఆధ్వర్యంలో ప్రజలకు వివరించారు. బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు లక్ష్మణ్, హన్మాగౌడ్, మహేందర్, గంగాధర్, సత్తన్న, శ్రీనివాస్, గోపి ఉన్నారు.

సారంగపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు కాల్వ నరేశ్ అన్నారు. సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్యారమూర్, తాండ్ర(జి) గ్రామాల్లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు రాజేందర్‌రెడ్డి, గంగారెడ్డి, సాహెబ్‌రావు, చెన్న రాజేశ్వర్, తిరుమల చారి, విలాస్, రాథోడ్ నారాయణ, శ్రావణ్‌కుమార్, భోజన్న, పోతన్న తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని మాంజ్రి, పాంగ్రి, చుచుంద్ గ్రామాల్లో మహా అభియాన్ సంపర్క్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షురాలు సుష్మారెడ్డి, భూమేశ్, సట్ల సాయినాథ్, హన్మాండ్లు, దేవిదాస్, నాగేశ్, నర్సయ్య, సాయినాథ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్: నర్సాపూర్ (జి) మండలం టెంబుర్నిలో గురువారం మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మండల ఉపాధ్యక్షులు చందుగౌడ్, సంగెం అశోక్, మీన సంతోష్, శనిగరాపు రాజు, భోజన్న, శంకర్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బ్యాంక్ రుణాలపై అవగాహన

కడెం: మండలకేంద్రంలో గురువారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పెద్దూర్‌శాఖ ఆధ్వర్యంలో బ్యాంక్ రుణాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ, వ్యక్తిగత, వ్యాపార, వాహన రుణాలు, సోలార్ రూఫ్‌టాప్ సబ్సిడీ తదితర సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. హబ్ మేనేజర్లు శ్రీకాంత్, గీత, బ్యాంక్ మేనేజర్ జి.నరేశ్, తదితరులున్నారు.

9న ఆదివాసీ దినోత్సవం

నిర్మల్‌టౌన్: జిల్లాలోని గ్రామాల్లో ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని ఆదివాసీ నాయకపోడ్ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు ముచ్చింద్ల రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. ప్రధాన కూడళ్లు, సంఘ భవనాల వద్ద ఆదివాసీ జెండా ఆవిష్కరించాలని కోరారు.

ఓపెన్ స్కూల్ కేంద్రం ప్రారంభం

నిర్మల్: నర్సాపూర్ (జి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్ల కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్, హెచ్‌ఎం బి. పురుషోత్తం, అసిస్టెంట్ కోఆర్డినేటర్ దర్శనం దేవేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 99896 51768నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బాబా ఆలయంలో పూజలు

కుంటాల: మండలంలోని కల్లూరుసాయిబాబా ఆలయంలో గురువారం రద్దీ నెలకొంది. మధ్యాహ్న హారతి కార్యక్రమంలో భక్తులు పాల్గొని బాబాను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష



కుభీర్‌లో మాట్లాడుతున్న వైద్యులు రాథోడ్ విజేశ్

సారంగపూర్: తల్లిపాలే పిల్లల ఆరోగ్యానికి శ్రీరామ రక్ష అని.. ఏడాది పాటు తల్లులు తమ బిడ్డలకు పాలు ఇవ్వాలని పలువురు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్, పాతతర్లపాడ్ అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ శ్యామల, అంగన్‌వాడీ టీచర్ విజయ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనాలు చేశారు.

కుభీర్: పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రు పాలు తాగించాలని వైద్యుడు రాథోడ్ విజేశ్ అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సీడీపీవో రాజశ్రీ,,హెల్త్ సూపర్‌వైజర్ సుగుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, పలువురు గర్భిణులు తదితరులున్నారు.

నిర్మల్: నర్సాపూర్(జి) మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల విశిష్టతను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీ విశారద గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ సాయన్న, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, వరల్డ్ విజన్ జిల్లా కోఆర్డినేటర్ బ్రహ్మన్న, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న తానూరు ఎంపీడీవో నసీరొద్దీన్

ఖానాపూర్: గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది దృష్టి సారించాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని తర్లపాడ్, సేవ్యానాయక్ తండా, సుర్జాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయా పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులు తనిఖీ చేశారు.

తానూరు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి ఎంపీడీవో నసీరొద్దీన్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి గ్రామస్తులకు క్లోరినేషన్ నీటిని అందించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని పేర్కొన్నారు. ఈజీఎస్ ఏపీవో శివలింగయ్య, కార్యదర్శులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

బస్టాండ్‌లో నిబంధనలు పాటించాలి

ఖానాపూర్: బస్టాండ్‌లో దుకాణదారులు నిబంధనలు పాటించాలని ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్–2 వీజీ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని బస్టాండ్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్‌లో దుకాణాల ఎదుట నిబంధనలకు విరుద్ధంగా రాఖీల దుకాణాలను ఏర్పాటు చేశారు. దీంతో దుకాణదారులు ఆర్టీసీ అధికారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తాము ఆర్టీసీకి అద్దె చెల్లిస్తున్నప్పటికీ రాఖీ దుకాణాలు ఏర్పాటు చేసుకుంటే అభ్యంతరం చెప్పడం సరికాదని పలువురు దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఖానాపూర్ కంట్రోలర్ పోశెట్టి, తదితరులు ఉన్నారు.

రాఖీల దుకాణం వద్దని దాడి.. ఇద్దరిపై కేసు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో తాత్కాలిక దుకాణం ఏర్పాటు విషయంలో ఇరువురు గొడవకు దిగారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన రామకృష్ణ బస్టాండ్ సమీపంలో గురువారం రాఖీ విక్రయాల కోసం దుకాణం ఏర్పాటు చేశారు. అబ్బు, సల్మాన్ అనే ఇద్దరు తమ దుకాణం ఎదుట కాకుండా మరో చోట ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ విషయమై ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో అబ్బు, సల్మాన్ కలిసి రామకృష్ణపై దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కుంటాల: విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని ఎంఈవో ముత్యం పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మురళి, ఉమేశ్‌రావు ఉన్నారు.

విద్యార్థికి సన్మానం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి శివసాయి స్పోర్ట్స్ కోటాలో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు హెచ్‌ఎం నరేందర్ రావు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థిని పాఠశాలలో సన్మానించి అభినందించారు.

బడికి పూర్వవిద్యార్థి చేయూత



విద్యార్థికి బూట్లు అందిస్తున్న దాత

ముథోల్: మండలంలోని ఆష్ట ప్రభుత్వ పాఠశాలలో గురువారం పూర్వవిద్యార్థి అయిన గ్రామానికే చెందిన బుచ్చన్న గారి అరవింద్‌రెడ్డి విద్యార్థులకు షూస్, సాక్స్‌లు అందజేశారు. పాఠశాలలోని 220 మంది విద్యార్థులకు రూ.50వేల విలువైన బూట్లు, సాక్స్‌లను విరాళంగా ఇచ్చారు. ఎంఈవో రమణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకురావాలని కోరారు. ఈసందర్భంగా అరవింద్‌రెడ్డికి అభినందనలు తెలిపి సన్మానించారు. విద్యార్థులకు ఐడీకార్డులు, టైలు సమకూరుస్తానన్న పట్టేపురం సతీశ్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.